యోగా ఫలం.. అమృత సమానం

- కార్యాలయాలు.. విద్యా నిలయాలు.. స్వచ్ఛంద సంస్థల్లో ఘనంగా యోగా దినోత్సవం
- ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు

యోగా దినోత్సవ వేడుకలు శుక్రవారం పలు కార్యాలయాలు, సంస్థలు, విద్యా నిలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు యోగసనాలు వేశారు. యోగా మాస్టర్లు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రపంచానికి దిశా నిర్దేశం చేసే యోగా మనదే అని తెలిపారు. ఇప్పుడు ప్రపంచం దీని వెంట నడుస్తోందని పేర్కొన్నారు.


ఏఎంసీలో యోగా చేస్తున్న వైద్యులు, వైద్య విద్యార్థులు

డాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాలలో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. యోగాకు యావత్ ప్రపంచం పట్టాభిషేకం చేస్తోందన్నారు. వైద్య శాస్త్రంలో యోగా నయం చేయలేని జబ్బు లేదన్నారు. యోగా దినోత్సవ ప్రత్యేకత, యోగా వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. నెహ్రూ యువ కేంద్ర డిస్ట్రిక్ట్ యూత్ ఆఫీసర్ జి. మహేశ్వరరావు, కన్స్యూమర్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి వెంకటరామ, నేషనల్ అవార్డు గ్రహీత లీలా ప్రశాంత్, యోగా ట్రైనర్ లీలారాణి, శంకరనారాయణ, పి. గాంధీ, స్వరాజ్యలక్ష్మి, పైడి రజనీ, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా కళాశాలలో..

విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో పలు విభాగాల ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల యోగా ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులచే యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


ఏవీఎన్ కళాశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు

ఆంధ్రా మెడికల్ కాలేజీలో..

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీలో శుక్రవారం యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ థీమ్‌తో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఫిజియాలజీ విభాగంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థిని హర్షిణి నేతృత్వంలో వివిధ యోగాసనాలు వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు మాట్లాడుతూ ఈ ఏడాది థీమ్ గురించి వివరించారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఐఎఫ్‌నెట్‌లో..

ఫిషింగ్ హార్బర్‌లో ఉన్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ నాటికల్ ఇంజినీరింగ్ ట్రైనింగ్ యూనిట్ (సీఐఎఫ్ఎన్ఈటీ) విశాఖ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగ దినోత్సవం నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ హృషికేష్ బిసోయ్ సభకు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 120 మంది అధికారులు, సిబ్బంది, ట్రైనీలు, మత్స్యకారులు ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా అమృత వర్షిణి, గువ్వ వెంకటేశ్వర్లను సన్మానించారు.

పలు పాఠశాలల్లో..

అల్లిపురం : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డాబాగార్డెన్స్‌లో గల మహాత్మాగాంధీ మున్సిపల్ హై స్కూల్, రైల్వే స్టేషన్ దరి ప్రభుత్వ హైస్కూల్, ఆర్టీసీ కాంప్లెక్స్ దరి డాక్టర్ వైఎస్సార్ సెంట్రల్ పార్కులో యోగా కార్యక్రమాలు విరివిగా చేపట్టారు. డాక్టర్ వైఎస్సార్ సెంట్రల్ పార్కులో జరిగిన కార్యక్రమంలో యోగా మాస్టర్ మొల్లి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయనను యోగా శిష్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశ యోగా నేడు ప్రపంచవ్యాప్తం అయిందన్నారు. ప్రతి ఒక్కరు యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడమే కాకుండా, రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు.


రైల్వే స్టేషన్ దరి ప్రభుత్వ హైస్కూల్లో యోగా చేస్తున్న విద్యార్థులు


యోగ సాధన చేసిన విద్యార్థులతో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు తదితరులు

సెయింట్ జోసెఫ్ కళాశాలలో..

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, యోగా యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం యోగా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ పి.డి.షైజీ మాట్లాడుతూ నిత్య జీవితంలో ఒత్తిళ్లని తట్టుకోవడానికి యోగాసనాలు దోహదపడతాయి అన్నారు. యోగా ఉపయోగాలను విద్యార్థినులకు వివరించారు. అనంతరం యోగాసనాలపై వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాణిక్యకుమారి, డి. రమేష్, డాక్టర్ ప్రవీణ్ బాబు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


ఆసనాలు వేస్తున్న సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల విద్యార్థినులు


సీఐఎఫ్‌నెట్‌లో ఆసనాలు వేస్తున్న సిబ్బంది


యోగాసనాలు వేస్తున్న ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు


వైఎస్సార్ సెంట్రల్ పార్కులో యోగా గురువుతో అభ్యాసకులు


యోగా శిక్షకుడు మొల్లి కిరణ్‌కుమార్‌ను సత్కరిస్తున్న శిష్యులు

క్లుప్తంగా

ఘనంగా మన్యుసూక్త హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

మహారాణిపేట : మెయిన్ రోడ్డులో కొలువైన శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతి నెల పౌర్ణమి రోజున స్వామివారికి హోమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హోమం వల్ల నరఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి వంటివి చేకూరుతాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ హోమం జరిగింది. రూ. 516 పూజా రుసుం చెల్లించి హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మతి స్థిమితం లేని మహిళకు ఆశ్రయం


వివేకానందం ఆశ్రమంలో మహిళ

డాబాగార్డెన్స్ : మతి స్థిమితం లేని అనుపమ అనే 25 ఏళ్ల మహిళను కొంత మంది స్వామి వివేకానంద ఆశ్రమంలో చేర్పించారు. ఈమె ఆచూకీ తెలిసిన వారు పాతనగరం సమీపాన గల స్వామి వివేకానంద సంస్థను సంప్రదించాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. లేదా వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాలన్నారు. ఆచూకీ తెలిసిన వారు 8297568913 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

దొండపర్తిలో మెగా ఫాగింగ్


దొండపర్తిలో ఫాగింగ్ చేస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

సీతమ్మధార : దోమల నివారణకు దొండపర్తిలో మెగా ఫాగింగ్ నిర్వహించారు. చుక్కా వారి వీధి, పులివారివీధి, పాలికలవీధి, బాగివారి వీధి, హరిజన వీధి, కుప్పిలివీధి, రామాలయం వీధి, సీరపు వారి వీధి, అల్లూరి వారి వీధి, దేవాంగుల వారి వీధి, మండా వారి వీధి, బాలాజీ టవర్, ద్వారకానగర్ 6వ లైన్ ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించామని జీవీఎంసీ సూపర్‌వైజర్ కె.ఎస్.ఎస్.నారాయణ తెలిపారు.

పార్సిళ్లను పరిశీలించాలి


పార్శిల్ సర్వీస్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఏడీసీపీ (సెబ్) శ్రీనివాసరావు

విశాఖ సిటీ : కస్టమర్ల పార్సిళ్లను నిర్వాహకులు తప్పకుండా పరిశీలించాలని ఏడీసీపీ (సెబ్) బి.శ్రీనివాసరావు పార్సిల్ సర్వీస్ ఆఫీస్ మేనేజర్లకు సూచించారు. నగరంలో కొన్ని పార్సిల్ సర్వీస్ సంస్థల ద్వారా తెలిసీ తెలియక గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్లు సమాచారం మేరకు శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో ఆయా సంస్థల నిర్వాహకులు, మేనేజర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా నేరమని, తెలిసినా, తెలియక పోయినా పార్సిళ్లలో డ్రగ్స్ లేదా గంజాయి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ (సెబ్) బి.శ్రీనివాసరావు, ఏసీపీ (సెబ్) సుబ్బారావు, ఇన్‌స్పెక్టర్ రాజుల నాయుడు, పార్సిల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మురికివాడను పరిశీలించిన డీఎంహెచ్‌వో


అప్పుఘర్‌లో మురికి వాడను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకుంటే వ్యాధులను నిర్మూలించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం అప్పుఘర్ ప్రాంతంలోని మురికి వాడను సందర్శించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్, ఇతర సబ్ యూనిట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వారం ఫ్రై డే డ్రై డే పాటించాలని తెలిపారు. దోమతెరలు వాడాలని, దోమల వల్ల మలేరియా, డెంగ్యూ రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జీటీడబ్ల్యు పోస్టుమెట్రిక్ గర్ల్స్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులు, వార్డెన్లకు పలు సూచనలు చేశారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనతోనే వ్యాధులకు అడ్డుకట్ట


వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న బయాలజిస్ట్ సాంబమూర్తి

జగదాంబ : దోమల నిర్మూలనకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని జీవీఎంసీ బయాలజిస్ట్ సాంబమూర్తి అన్నారు. శుక్రవారం జోన్ పరిధి పాతనగరంలో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా వంటి ప్రమాదకర వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి కుండీలపై మూతలు పెట్టుకోవాలన్నారు. ఇంట్లోని ఫ్రిజ్‌ల వెనుక ఉన్న నీటిని కూడా శుభ్రం చేసుకోవాలన్నారు. దోమతెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. రానున్నది వర్షా కాలం కావటంతో పారిశుధ్య సిబ్బంది నీటికుంటల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. పాతటైర్లు, తాగి పడేసిన కొబ్బరి బొండాలు ఇంటి పరిసరాల్లో ఉండకూడదన్నారు. ప్రతి ఇంటిలో తడి-పొడి, ప్రమాదకర చెత్తను వేరే చేయటానికి మూడు రకాల డస్ట్‌బిన్లు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో రాజేష్, శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉమా చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో ఉమాచంద్రమౌళీశ్వర స్వామి వారు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం : టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు భార్గవశర్మ శైవాగమన సంప్రదాయంలో కల్యాణం జరిపించారు. కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు ఈవో స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ముందుగా స్వామివారి ఉత్సవ విగ్రహాల తిరువీధి ఉత్సవం అస్సాం గార్డెన్స్, టూటౌన్ రోడ్డు, డాబాగార్డెన్స్, నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం మీదుగా సాగి దేవస్థానానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో అక్కాజోశ్యుల రమేష్ శర్మ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, ఆలయ సిబ్బంది మన్మథరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీ దళార్చన.. కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

రైతుబజార్లలో పార్కింగ్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

మహారాణిపేట: కంచరపాలెం, గోపాలపట్నం రైతు బజార్లలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ ప్రాంతం నిర్వహణ కోసం ఒక ఏడాది కాలానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నారు. జులై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు పార్కింగ్ నిర్వహణ కోసం ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు రూ.10 వేల ధరావత్తు సొమ్మును జిల్లా జాయింట్ కలెక్టర్, రైతుబజార్లు, విశాఖపట్నం వారి పేరున డీడీని జత చేసి దరఖాస్తులను పంపాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22 నుంచి 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట లోపు అందజేయాలన్నారు. 28న సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని, బేస్ రేట్లు కూడా ఇస్తామని వివరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం పాట నిర్వహిస్తామన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు, ఇతర ఫారాలను జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి, డోర్ నంబర్ 8.202/2, ఆర్ ఆర్ వెంకటాపురం, గోపాలపట్నం, రైతుబజార్ పక్కన, విశాఖపట్నం-530029కు అందించాలన్నారు. వివరాలకు 90308 19082 నంబర్‌లో సంప్రదించాలని జేసీ కోరారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు స్పందన


సీపీకి వినతులు అందజేస్తున్న సిబ్బంది

అల్లిపురం : నగర పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సిబ్బంది గ్రీవెన్స్‌కు స్పందన లభించింది. శాంతి భద్రతలు, ట్రాఫిక్, క్రైమ్, ఏఆర్‌కు సంబంధించి 30 మంది సిబ్బంది శాఖాపరమైన సమస్యలపై నేరుగా సీపీ డాక్టర్ రవిశంకర్‌కు వినతులు అందజేశారు. ఇంక్రిమెంట్లు, డిప్యుటేషన్, ఆరోగ్య సమస్యలు, ప్రమోషన్లకు సంబంధించి అందిన వినతులపై స్పందించిన సీపీ వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉక్కు రిటైర్డ్ ఉద్యోగి మృతి


నాగార్జునరావు మృతదేహం

ఉక్కునగరం: స్టీల్ ప్లాంట్ పవర్‌గ్రిడ్ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి ఒకరు మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్‌లో పదవీ విరమణ చేసిన పైలా నాగార్జునరావు(62) కూర్మన్నపాలెంలో ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం కారులో టౌన్‌షిప్ వెళ్లారు. అక్కడి నుంచి దేశపాత్రునిపాలెం మార్గంలో వెళ్తుండగా కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం ఒరిగిపోవడంతో పాటు కారు ముందు భాగం నుజ్జయింది. ఈ ఘటనలో నాగార్జునరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనను ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐసీఏఐ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం


యోగాసనాలు వేస్తున్న అకౌంటెంట్లు

విశాఖ సిటీ: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) విశాఖ ఛాప్టర్(ఎస్ఐఆర్‌సీ) ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఛార్టెర్డ్ అకౌంటెంట్ సభ్యులతోపాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఆసనాలు వేశారు. యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మానసిక ఒత్తిడిని జయించి శారీరక దారుఢ్యాన్ని పొందవచ్చని అకౌంటెంట్స్ పేర్కొన్నారు. ఏయూలో యోగా డిప్లమో హోల్డర్ మింటె త్రిమూర్తులు సభ్యులను చైతన్యపరిచారు. మేనేజింగ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ అనిర్బాన్ పాల్, కార్యదర్శి పట్నాల లోకేష్, సీఏ వాసుదేవ మూర్తి, స్టూడెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్కూల్ ఆటో డ్రైవర్లు భద్రతా నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్



సదస్సులో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్

విశాఖసిటీ: నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తిరుగుతున్న ఆటోడ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని ద్వారకానగర్ ట్రాఫిక్ విభాగం ఎస్ఐ భాస్కర్ సూచించారు. ద్వారకానగర్ శ్రీచైతన్య స్కూల్‌లో రహదారి భద్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ రవికిరణ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎస్ఐ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి ఆటోడ్రైవర్ తమ వాహనానికి సంబంధించిన పత్రాలను ఎప్పటికప్పుడు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. స్కూల్ ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ సిబ్బంది నిర్వహించే తనిఖీలకు సహకరించాలన్నారు. విద్యార్థులతో వస్తున్నప్పుడు డ్రైవర్లు రహదారి క్రమశిక్షణ పాటించాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ రవికిరణ్ మాట్లాడుతూ భావితరాలకు వారధులైన విద్యార్థుల భద్రత ఆటోడ్రైవర్ల చేతుల్లో ఉందన్నారు. అలాగే బాలికల భద్రత విషయంలోనూ డ్రైవర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్ సూచించారు. సమావేశంలో శ్రీ చైతన్య పాఠశాలల ఏజీఎం ఎంవీ సురేష్, ఆర్ఐ అలీ, డీన్‌లు గౌరినాయుడు, సురేష్, ఏవో దిలీప్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


పురస్కారాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, అతిథులు

అల్లిపురం : పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన రైల్వే క్వార్టర్స్‌లో గల ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు గాను ఆరుగురికి అకడమిక్ ఎక్స్‌లెన్స్ అవార్డులు అందజేశారు. దీంట్లో భాగంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో గేదెల తిరుమలేసు, యలమంచిలి యశ్వంత్, తంగేటి వెంకట కార్తీక్‌లకు పడాల రత్నాలు అకడమిక్ ఎక్స్‌లెన్స్ స్కాలర్‌షిప్ కింద రూ.5 వేల నగదు, సర్టిఫికెట్, మెడల్లు అందజేశారు. పల్లా త్రివేణి, మీసాల శిరీష, అంబటి వర్షిణిలకు డబ్బీరు సుగుణ అకడమిక్ ఎక్స్‌లెన్స్ స్కాలర్ షిప్ కింద రూ.5 వేల నగదు, సర్టిఫికెట్, మెడల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేసిన డి.రమణి, డి.లక్ష్మి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సుధ, కార్యదర్శి జి.సుభాకర్, ఫిజికల్ డైరెక్టర్ డి.ప్రసన్నకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నీట్' లీకేజీపై నిరసన జ్వాల


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఈసీ ప్రతినిధులు

సీతమ్మధార: నీట్-2024 పరీక్ష పేపర్ లీకేజీపై నిరసనలు కొనసాగుతున్నాయి. ఏఐఎస్ఈసీ ఆధ్వర్యంలో నీట్ విద్యార్థుల తల్లిదండ్రులు శుక్రవారం జీవీఎంసీ గాంధీ పార్కులో ఆందోళన చేపట్టారు. ఏఐఎస్ఈసీ రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏను రద్దు చేయాలని, నిజాయతీగా పరీక్ష రాసిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలని, నీట్ కుంభకోణంలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. దీనిపై ప్రభుత్వం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధ్యాపకులు శంకరావు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సత్యవతి, ఎస్.గోవింద్, పాల్గొన్నారు.